# చెల్లని కానీ

[కథానిక]

∴

= శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి =

"ఇంకో కానీ!" అన్నాడు ట్రాము వాడు.

"దీనికేం?" అన్నాను నేను.

"అది చెల్లదు!"

*　　*　　*

ఇంటికి చేరేటప్పటికి ఆరు దాటింది.

"ఏమైంది?" అన్నాడు శాస్త్రి.

"వాడి శ్రాద్ధం అయింది! ఇచ్చేదీ లేనిదీ చెప్పడు!"

"నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు నీకు వుద్యోగం కాదు!" అన్నాడు శాస్త్రి కచ్చితంగా.

"ఏమిటి నాలో లోపం?"

"వుద్యోగం సంపాదించటం పరీక్ష పాసు కావటంవంటిది. చదవకుండా పాసుకావటం ఎలాగో నీకు తెలుసుకదా—అది నీ అనుభవంలోనిదే! వుద్యోగం సంపాదించటం కూడా అలాంటిదే. అయినా మనలో మాట. అసలు ఎవడైనా నీకు ఎందుకు వుద్యోగం ఇయ్యాలి?" శాస్త్రి నాకు ఎదురు తిరిగాడు.

"ఎందు కియ్యకూడదు?"

"ఎందు కియ్యాలి అని నేను అడుగుతున్నాను. నెలకు ఎనభయ్యో తొంభయ్యో నీకు ఎందు కియ్యాలి అని అడుగుతున్నాను!"

"నీకు మనిషి కావాలి కనక! నీకు మనిషి అవసరం వుంటే జీతం ఇయ్యకుండా ఎలా తప్పుతుంది? నీచుట్టానికి నీవు వుద్యోగం ఇచ్చుకున్నా తృణమో కణమో ఇయ్యక తప్పదుకదా!"

"నాకు మనిషి కావాలన్నప్పుడు నా కిష్టంవచ్చిన మనిషిని ఏరుకోవటం నాతప్పు కాదుకదా! నాకు నీవు నచ్చలేదుకనక నీకు వుద్యోగం ఇయ్యను అనటానికి నాకు అధికారం వుందంటావా, లేదంటావా?"

"నువ్వు నాకు వుద్యోగం ఇయ్యను అని చెప్పితే నాకు ఏమాత్రం అభ్యంతరమూ లేదు. అలా కాక ఇదిగో అనీ, అదిగో అనీ ఏమీ చెప్పక ఆరునెల్లు తిప్పితే నీమీద నాకు వొళ్లుమండితే మటుకు నాది తప్పు కాదు!"

"నేను చెప్పేది విను. నీబోటివాళ్లు వుద్యోగాలకోసం ప్రయత్నం చేస్తున్నవాళ్లు—ఈవూళ్లో ఎంతమంది వున్నా రంటావు?"

"చాలామంది వుంటారు."

"అందరికీ వుద్యోగాలు లభిస్తయ్యా?"

"అందుకని ప్రయత్నం చెయ్యటం మానేస్తామా— పురుష ప్రయత్నం చెయ్యద్దూ?"

"నేను చెప్పేది వినకుండా గోలచేస్తావు దేనికీ ? ప్రయత్నంచేసే ప్రతివాడికీ వుద్యోగం లభించటానికి అవకాశం లేదన్న విషయం నీవు గుర్తించావుకదా! మరి వుద్యోగం లభించాలంటే ప్రత్యేకత చూపించాలి. నలుగురిలోనూ మనల్ని ఏరుకునేటట్టు చెయ్యాలి. మసి పూసి నేరేడుకాయ చెయ్యాలి. నీ తెలివితేటలూ వాటి సంగతి మర్చిపో. అవి ఎవరికీ అక్కర్లేదు. పైగా ముఖ్యమైన విషయం—నువ్వు ఈ వేషంతో వెళ్తే నీకు ఏ అప్రయోజకుడూ వుద్యోగం ఇయ్యడు. సూటూ కోటూ వేసి మరీ వెళ్లు"

"అదిమటుకు నావల్ల కాదు!" అన్నాను నేను."

"మరి నీకు వుద్యోగం ఇయ్యటంకూడ నావల్ల కాదు. నే నింతవరకూ ఎవ్వరికీ అలా వుద్యోగం ఇయ్యలేదు. నాబోటివాళ్లు ఎవరూకూడ ఇయ్యలేదు. నీలో ఏమి ప్రత్యేకత వుందని సూటులేకుండా వుద్యోగం ఇయ్యమంటావు ? ఆఫీసులోవారంతా సూటు వేసుకుని వస్తుంటే నీవు వక్కడివి ధోవతితో వస్తే నాకు చూడటానికి అసహ్యంగా వుంటుందని నీవు ఎందుకు గ్రహించలేవు?"

"నీకు కావలిసింది పనా, సూటా?" అన్నాను నేను.

"నాకు ఏది కావాలో నాకు తెలుసు-ఆవిషయం చెప్పాలిసినవాడివి నీవు కాదు! నేను జీతం ఇస్తున్నంతకాలం నా ఆఫీసులో మనిషి నాకు నచ్చేటట్టు వుండకతప్పదు!"

"మరి, అయితే, సూటు వేస్తే వుద్యోగం దొరుకుతుందా ?"

"అది వేరే ప్రశ్న ! సూటు లేకుండా మటుకు నీకు వుద్యోగం దొరకదు."

"మరి సూటు కుట్టించాలంటే డబ్బు కాదా ?"

"అదంతా నీవు చూచుకోవలసిన విషయం."

"తీరా డబ్బు ఖర్చు పెట్టేం తరువాత ఏమీ కాకపోతే?"

"అదీ నువ్వు చూచుకోవలసిన విషయమే! మాకు సిరి, సంపద, సంతానం కావాలని సత్యనారాయణవ్రతం తీరా డబ్బు ఖర్చుపెట్టి చేసుకున్న తరువాత మన కోరికలు సిద్ధించకపోతే!"

* * * *

ఆ సాయంత్రం బయలుదేరాను — డ్రెస్సు కొందామని. శాస్త్రికూడా వచ్చాడు నాతో. మొత్తంమీద డ్రెస్సు తయారు అయింది.

రాత్రి భోంచేసి వచ్చేం తరువాత డ్రెస్సు ఎలా వెయ్యాలిసిందీ మొదలైన భోగట్టాఅంతా చూపించాడు. నా అంతట నేను డ్రెస్సు వేసుకోగలిగేటప్పటికి రాత్రి పది దాటింది. ఆఫీసరుదగ్గిరికి వెళ్లేటప్పుడు ఎలా నడవాలో, వాడు సిగిరెట్టు ఇస్తే ఎలా తగలెయ్యాలో మొదలయిన వన్నీ చూపించాడు. ఇటువంటివాటిలో మావాడు నిధి ! కాని భగవంతుడు అతని తెలివితేటలకు తగ్గ ఉద్యోగం ఇప్పించలేదు. శాస్త్రికి ఇంత అనుభవం ఉండీ ఇంత తెలివితేట లున్నా, ఇన్నాళ్లమట్టి వుద్యోగం చేస్తున్నా చేసే ఉద్యోగం చిన్నదిగా ఉండటమే కాక

తెచ్చుకునే జీతంకూడా స్వల్పంలోనే ఉండి పోయింది. అతని దురదృష్టం కాక మ రేమిటి ?

మర్నాడు పుదయం నేను తయారు అయినాను. శాస్త్రి పదినిమిషాలలో చేసే పని నాకు అరగంట పట్టింది. నాకు ఏమిటో వెర్రిగా వుంది.

"సరిగా వుందా?" అన్నాను శాస్త్రితో. శాస్త్రి బిగ్గిరిగా నవ్వటం మొదలుపెట్టాడు.

"అదేమిటి, చొక్కా పైకి వదిలేశావు?"

పొరపాటు! నా అవస్థలో చొక్కా పంట్లాములోపలికి వెయ్యటం మరిచిపోయి నాను. మళ్లీ తయారయ్యేటప్పటికి చెమటలు పోసి డ్రెస్సు బాగా నలిగిపోయింది!

"ఫరవా లేదు లే! వెళ్లు—నే చెప్పిన వేవీ మర్చిపోకు."

శుభశకున మైంది. కిందటిసారి ట్రాము వాడు చెల్లదు అని ఇచ్చేసిన కానీకి రంగు వేసి ఇచ్చాను. వాడు దాన్ని అర్ధరూపాయ కింద తీసుకుని నాటిక్కెట్టు పోను మిగతా చిల్లర ఇచ్చేశాడు. ఎక్కువసేపు వుంటే వాడు కనుక్కుంటాడేమోనని వెంటనే దిగి మరోట్రాము ఎక్కాను. ఇంకోటిక్కెట్టు ఖర్చు!

"ఏమైంది?" అన్నాడు సాయంత్రం నేను ఇంటికి రాగానే శాస్త్రి.

"నాదుంప తెగింది!" అన్నాను నేల మీాద చేరగిలబడుతూ.

"అలా వున్నా వేం?"

"బూటు కరుస్తున్నది! కాలు తీసి కాలు పెట్టలేకుండా వున్నాను."

"అసలు పని ఏమైంది చెబుదూ?"

"రేపటినించి ఆఫీసుకు రమ్మన్నాడు."

"అత్తెరీ! నేను చెప్పలా!"

"వెళ్లకుండా మానేద్దామని వుంది!"

"నీకు నిజంగా మందు కావాలిసిందే! ఇన్నాళ్లు ప్రయత్నంచేసి తీరా వుద్యోగం దొరకగానే నచ్చుతావేం? నీ కున్న శక్తి యావత్తూ ప్రయత్నానికే వినియోగించా వన్నమాట - మరి ప్రతిఫలాన్ని అనుభ వించేటందుకు నీకు శక్తిలేకుండా చేసు కున్నావు!" శాస్త్రి లేచి మందుపెట్టె తెరి చాడు.

"నీమందు నాకు అక్కర్లేదు—రోజూ ఈ వెధవవేషం వేసుకుని ఎవడు పోతాడు కుంటుకుంటూ!"

"నేను చెప్పగలిగింది ఇదివరకే చెప్పే శాను!" అన్నాడు శాస్త్రి.

* * * *

"ఎలా వుంటున్నది ఆఫీసు?" అన్నాడు శాస్త్రి ఒకరోజున.

"నా మొహం ఆఫీసు! మా దొర వట్టి వెధవలా వున్నాడు!"

"ఏం?"

"వాడు నా కెందుకు వుద్యోగం ఇచ్చాడో నాకు అర్థం కాలేదు."

"అంటే?"

"నేను చేసే పనేమీా లేదు అక్కడ. పొద్దున ఒక గంట ఉంటుంది ఏదో పని. తర్వాత సాయంత్రం మరోగంట ఉంటుంది. మిగతా అయిదుగంటలు ఏం చెయ్యాలో

తెలీదు. పోనీ, ఎవడితోనన్నా మాట్లాడదామన్నా, అందరూ పనిలో మునిగివుంటారు!"

శాస్త్రి బిగ్గిరగా నవ్వటం మొదలు పెట్టాడు.

"ఎందుకొస్తుంది అస్తమానం నీకు ఆ నవ్వు?"

"క్షమించు బ్రదర్! ఈ స్వల్పవిషయానికి మనిద్దరం పోట్లాడుకోటం దేనికి? కాని వక సంగతి—"

"ఏమి టది?"

"నేను టైపిస్టు నన్న సంగతి నీకు తెలిసిందేకదూ? రోజూ నేను ఎన్నిగంటలు పని చేస్తా ననుకుంటావు?"

"ఏమో, నా కేం తెలుసు?"

"నీకు ఆశ్చర్యంకలగచ్చు—నేను రోజూ ఒక గంట పనిచేస్తాను. సాయంత్రానికి ఆఫీసు ఉత్తరా లన్నీ నాదగ్గిరికి వస్తయి. ఒక గంటలో అన్నీ టైపుచేసి అవతల పారేస్తాను. మరి పొద్దుటినించీ నేను ఏంచెయ్యాలె? ఇంకో సంగతి: నీకు తెలుసునో తెలియదో! అంతా సాయంత్రం అయిదున్నర గంటలకే ఆఫీసునుండి వెళ్లితే నేను మరో పావు గంట ఆలస్యంగా వెళతాను. నేను చేసేది రోజుకు నిజంగా ఒక గంట పని అయినా అది అందరూ వెళ్లింతరువాతకూడా వుండేటట్టు చూడటం నేను కష్టపడి నేర్చుకున్నాను. నామీద దొరకు మంచి అభిప్రాయం వుంటుం దంటే ఆశ్చర్య మేముంది? మరి ఎప్పుడైనా మా ఆఫీసుకు రా—నాకు నీతో మాట్లాడటానికి ఒక్కక్షణం తీరుబడి ఉంటుందేమో చూద్దువుగాని! నా టైపురేటరు ఎప్పుడూ చప్పుడు చేస్తూనే వుంటుంది. నీవు మొట్టమొదట నేర్చుకోవలిసింది పని లేనప్పుడు పని చెయ్యటం. తర్వాత తెలుసుకోవలిసింది నువ్వు చేసే పని బాగా చెయ్యటంకూడ కాదు— నీదొరకు నచ్చేటట్టు చెయ్యటం. నీవు చేసే పని బాగా చేసేటట్టయితే అది నీదొరకు నచ్చక పోవచ్చు. సాధారణంగా అలాగే జరుగుతుందికూడాను! పైపెచ్చు నువ్వు చేసే పనిని చూసీచూడనట్టుగా అశ్రద్ధగా చేస్తే నీదొరకు నచ్చవచ్చు. అలాంటప్పుడు నీవు పనిని చాలా శ్రద్ధగా నీ స్వంతవ్యవహారమల్లే చెయ్యటంలో నష్టంలేదుకాని ఒక్క పిసరుకూడా లాభం లేదు. కాబట్టి నీదొర అభిరుచినిబట్టి ప్రవర్తించాలి. ఏతావతా ఆఫీసుకు వెళ్లి నువ్వు గమనించాలిసింది దొరనుగాని నీపనినిగాదు."

"రోజూ ఒకగంట ఈవేషం వెయ్యటం, కుంటుకుంటూ నడవటం, చేతగాకుండా ఆఫీసులో దొరల్లే ప్రవర్తించటం, పనిలేనప్పుడు పనిచెయ్యటం నేర్చుకోవటం, దొరని గమనిస్తూ వుండటం—ఇవన్నీ వీళ్లు ఇచ్చే ఈ ముష్టిజీతానికేనా?"

"ఆ సంగతి అడగాలిసింది నన్నుగాదు! నీ వుద్దేశం ఇంటో కూచుని నీయిష్టం వచ్చినట్టు వుండటానికి ఇయ్యమంటావా జీతం నీ దొరని?"

"నా చేత పని చేయించుకోమను, జీతం ఇయ్యమను. కడం విషయాలు వాళ్ళకెందుకు?"

"వాళ్లు అసలు నీకు వుద్యోగం ఇయ్యాలిసిన అవసరం ఏముంది? నీ కంటె పని బాగా చెయ్యగలవాడు దొరక్కనా?"

* * *

"నే నీ వుద్యోగం చెయ్యలేను శాస్త్రీ!"

"మళ్లా ఏం వచ్చింది ?"

"మన ఆఫీసరు దక్కేటట్టు లేదు. మా ఆఫీసులో ఓ సుబ్బారాయుడు దొరికాడు. చస్తున్నాను వాడితో. వాడు నా పైమనిషి. వాడి ఆడాలో వుండాలి నేను. నేను పని చేస్తుంటే 'ఇలా ఎందుకు చేస్తున్నావు' అంటాడు వచ్చి. పని లేనప్పుడు పని చేస్తున్నట్టు నటిస్తుంటే 'పనేమీ లేదా చెయ్యటానికి' అని సతాయిస్తాడు. అసలు సంగతి ఏమిటంటే, వాడి అవస్థ వాడిది! వాడికి చేసేటందుకు బొత్తిగా పనిలేదు. వాడు పనిచేస్తున్న ట్టుండకపోతే దొర వాడిని తీసేస్తాడు అని అతగాడికి తెలుసు — నీ జాతే!"

శాస్త్రి నవ్వాడు.

"అందుకని మామీద విరుచుకుపడుతాడు. అరెరె! అందరూ వెళ్లిపోయే సమయానికి వాడి కున్నంత పని మరెవరికీ వుండదు! దొరకి వాడంటే ప్రాణం. ఇవాళ నామొహాన నాలుగు బండ ఎకౌంట్లు పారేసి పూర్తి చెయ్యమన్నాడు. ఎక్కడ పొరబాటు వస్తుందో నని నేను జాగర్తగా ఒకటికి రెండుసార్లు సరిచూచి పూర్తిచేసి వాడికిచ్చాను. నే నిటు వచ్చానో లేదో నాకు కబురు పంపించాడు. కొంప మునిగింది ఏదో పొరబాటు వచ్చిం దనుకున్నాను. నేను చేసిన లెక్క-కాగితంమీద దొరకుమల్లే చేత్తో కొడుతూ 'ఇలా చేశా వేమి పొరబాటుగా' అన్నాడు. చచ్చాంరా అనుకుని అక్కడే కూచుని అంతా మళ్లీ చేసి 'సరిగానే వుందే' అన్నాను. 'సరిగా వుందా' అని అది తీసుకుని 'సరే' అని వెళ్లాడు. వాడి వుద్దేశం ఏమిటి అంటాను! నిజంగా శిగపాయ తీసి తందా మనిపించింది — వెధవ!

"నా అవస్థ దొరతో మొరపెట్టుకుందా మనుకున్నాను. ఎప్పుడు చూచినా వాడు అక్కడే వుంటాడు. అనేకసార్లు దొరదగ్గిరికి వెళ్లాను అనేకపనులమీద. ఎప్పుడూ వాడు అక్కడే తయారు-పని వున్నా, లేకపోయినా! ఎవరన్నా వచ్చి ఏవిషయమూ దొరతో ప్రైవేటుగా మాట్లాడే అవకాశం లేదు. మాఆఫీసు అంతా సొంత ఆస్తికింద చూచుకుంటాడు. ఎవరన్నా ఆలస్యంగా వస్తే వాడి ప్రాణం పోతుంది. దొరకు లేని దిగులు వాడికి పట్టింది!"

"ఎప్పటికైనా వాడే మేనేజరు అవుతాడు!" అన్నాడు శాస్త్రి.

"మేనేజరు సిగ్గోసిరి ! నేనుమటుకు చెయ్యలేను బాబూ ఆపని!"

"అక్కడే వుంది కిటుకు!"

"పైగా ఈవెధవవుద్యోగం నా కెందుకు ? ఆ గుర్రపుపందాలదగ్గిర టిక్కెట్టు కలెక్టరుగా నియమించి ఈ ఇచ్చే జీతంలో సగం ఇచ్చినా నేను తృప్తిగా జీవించగలను!"

"అలాంటప్పుడు నీవు ఈవుద్యోగానికే ప్రయత్నించకూడదు!"

"మొన్న ఇంకోతమాషా అయింది — మాదొర నామీద విసుక్కున్నాడు-ఎందుకో నా కర్థంకాలేదు!"

"దేనికి ?"

"ఏమో ! ఒకటిమటుకు నేను గమనించాను. పనిలేనప్పుడు పని చేస్తున్నట్టు నటి

చటం నాకు చాతకాలేదు. కాదుకూడాను. ఆవిషయంలో నేను రెండుమూడుసార్లు బయటపడ్డాను. మా ఆఫీసులో అతినిపుణులున్నారు—వారు చేసే పని, ఆపని చేసే పద్ధతి అద్భుతం!"

* * *

"ఏమిటి విశేషాలు?" అన్నాడు శాస్త్రి.

"నేను వుద్యోగం వదిలిపెట్టాను"

శాస్త్రి లేచి కూచున్నాడు.

"ఏం జరిగింది?"

"నాకు రెండునెలల జీతం ఇచ్చి రేపటి నుంచి ఆఫీసుకు రానవసరం లేదన్నాడు దొర."

"నువ్వేమన్నావు?"

"నేనేమన్లేదు!"

"దొర ఏమన్నాడు?"

"పని చెయ్యలేని నాబోటివాళ్లు వాళ్ల ఆఫీసులో అక్కర్లేదన్నాడు!"

"నువ్వేమన్నావు?"

"పని చూపించలేనివాళ్లకు పని చెయ్యగలిగినవాళ్లు నిజంగా అనవసరం అన్నాను"

"దొర ఏమన్నాడు?"

"అదోరకంగా చూచాడు నావంక—ఏం చెయ్యాలో తెలియక."

"తర్వాత?"

"వాడి వుద్దేశాన్ని గ్రహించినట్టుగా చూచి వచ్చాను!"

"తర్వాత?"

"బయిటికి వచ్చింతరువాత ఇద్దరు ముగ్గురు—అదివరకు ఎన్నడూ నాతో మాట్లాడనివాళ్లు—నవ్వుతూ నన్ను పలకరించారు. నాధైర్యాన్ని చూచి మెచ్చుకున్నట్టుగా కనిపించారు!"

"వెధవలు! ఇలాంటివాళ్లు ప్రతి ఆఫీసులోనూ వుంటారు. కొత్తవాడు ఆఫీసులో చేరితే దిగులుపడతారు. ఆఫీసులో ఎవడికన్నా వుద్యోగం వదిత్తే సంతోషిస్తారు!"

"నువ్వు చెప్పింది నిజమనుకోటానికి నాకు అభ్యంతరం ఏమీలేదు. నావుద్యోగం పోయినందుకు వాళ్లు సంతోషించివుండవచ్చు!"

"మరి కర్తవ్యం?"

"ఈ ఆఫీసులలో వుద్యోగాల్ని అసహ్యించుకొనేవాళ్లు నాకు అనేకమంది కనిపించారు. వాళ్లందరికీ ఈ వెధవవేషం వెయ్యటం అసహ్యంకూడాను. తినేందుకు తిండి వున్నా, వాళ్ల అభిరుచులు వేరేవున్నా వాళ్లు ఈ వుద్యోగాలను జలగలల్లే పట్టుకుని వేళ్లాడటం ఎందుకో నా కర్థంకాలేదు. మొత్తంమీద ఆ వేషంలోనూ, ఆఫీసులోనూ మనిషిలో గుప్తంగా వున్న గోరోజనాన్ని తృప్తిపరిచే శక్తి వుండివుండాలి — లేకపోతే వారి నోళ్లు ఈ వుద్యోగాల్ని నిరసించినా, మొహాలు అలా వికసిస్తూవుండవు! నెలకు ముప్ఫైరూపాయలలో జీవితాన్ని ఆనందించే దరిద్రుడిని చూచి అసూయపడే భాగ్యవంతుల్ని నేను చూచాను. 'వాడికేం, వాడు మహారాజు!' అంటాడు. ఆలోచిస్తే వీడి ఆస్తిలో వాడి ముప్ఫైరూపాయలు ఎంత?

నాకు వుద్యోగం పోగానే 'నీ కేం మహారాజువి! మాబోటివాళ్లకు ఈ బాడఖో పని తప్పదు!' అన్నాడు ఒకడు. అతడు మా ఆఫీసులో మూడు వందలరూపాయల జీతంమీద వున్నాడు! కాని, శాస్త్రీ, నువ్వు నాకు ఒక్కవిధంగా నచ్చావు. నీవు చేస్తున్నది చిన్న వుద్యోగమైనా, జీతం స్వల్పమైనా నీపనిని అసహ్యించుకోగా నేను చూడలేదు. నీమోజును కూడ దాచలేదు నీవు నాదగ్గిర. లోపల గర్వపడుతూ పైకి వారు చేసే వుద్యోగాలని నిరసించే వారికంటె—అటువంటివారిని నేను చాలా మందిని చూచాను ఈకొద్దిరోజులలోనే—నువ్వు లక్షరెట్లు మేలు. వారితో పోలిస్తే నువ్వు దేముడివి! నాకు ఈవుద్యోగాలమీద నీకున్న మోజు లేదు. కాని నిన్ను నిజంగా మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. నీ అభిరుచి నీది. దానిని తప్పుపట్టటానికి బ్రహ్మకైనా అధికారం లేదు!"

*  *  *  *

నాకథ పూర్తికాలేదు. అర్ధరూపాయిగా మార్చిన కానీ తిరిగి నాదగ్గిరకే కానీరూపంతో వస్తుందని నాకు ఎందుకో నమ్మకం పడిపోయింది. అలా జరిగితే ఎంత బాగుంటుంది! ఆ కానీ నాదగ్గిర కింతవరకూ రాలేదు. రాగానే చెప్పతాను. దాంతో కాని కథ పూర్తికాదు!

